తవ్వారు.. వదిలేశారు

- యూజీడీ నల్లా కనెక్షన్‌ కోసం తవ్వి వదిలేసిన వైనం
- ఇబ్బందులు పడుతున్న నాలుగు డివిజన్లలోని కాలనీవాసులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

రామంతాపూర్‌: ఉప్పల్‌ సర్కిల్‌లోని నాలుగు డివిజన్‌లో నిత్యం ఏదో ఒక బస్తీ, కాలనీల్లో అంతర్గత ప్రధాన రోడ్లలో జీహెచ్‌ఎంసీ అనుమతులు లేకుండా కొంతమంది తమ ఇంటికి కావాల్సిన భూగర్భ డ్రైనేజీ, నల్ల కనెక్షన్ల కోసం జీహెచ్‌ఎంసీ అనుమతులు లేకుండా రోడ్లను ఇష్టానుసారంగా తవ్వేసి వదిలేస్తున్నారు.

నిర్ణీత ఫీజుతో మరమ్మతులు..

ఇంటికి కావాల్సిన మౌలిక సౌకర్యాలు ఏర్పాటుకు అనుమతులు తీసుకుని రోడ్లను తవ్వి ఏర్పాటు చేసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. జీహెచ్‌ఎంసీ అధికారులు తవ్వే రోడ్ల దూరాన్ని అంచనా వేసి నిర్ణీత ఫీజును వసూలు చేసి, పనులు పూర్తయిన అనంతరం మరమ్మతులు చేసి రోడ్డు వేస్తారు. దీంతో ఎలాంటి ఇబ్బంది ఉండదు. అనుమతులు లేకుండా అక్రమంగా రోడ్లను తవ్వుతున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలు కాలనీల, బస్తీల సంక్షేమ సంఘాల నేతలు వాపోతున్నారు.

◆ 10 రోజుల క్రితం రామంతాపూర్‌ డివిజన్‌ పరిధిలోని కామాక్షిపురం వీధి నెంబర్‌–5లో ఓ ఇంటి యజమాని భూగర్భ డ్రైనేజీ కనెక్షన్‌ కోసం జీహెచ్‌ఎంసీ అనుమతులు లేకుండా భారీగా రోడ్డును తవ్వి వేశారు. వెంటనే పనులు పూర్తి చేయక తవ్విన రోడ్డును పూడ్చకుండా గత 10 రోజులుగా తవ్విన రోడ్డును వదిలేశారు. దీంతో చెత్త సేకరించే వాహనాలు, స్కూల్‌ వ్యాన్‌లు, రావడం లేదని చెబుతున్నారు. దీనిపై జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సమాచారం అందించిన పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రజాప్రతినిధులు పట్టించుకుని తవ్వి వదిలేసిన ఈ రోడ్డును పూడ్చివేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్థానికుల శ్రమదానంతో..

వీధి నెంబర్‌–5 కామాక్షిపురంలో భారీ ఎత్తున అక్రమంగా తవ్వి వదిలేసిన గుంతలను పూడ్చివేయాలని కోరిన జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో మంగళవారం స్థానికులంతా కలిసి శ్రమదానం చేసి గుంతలు పూడ్చివేశారు.


రామంతాపూర్‌ కామాక్షిపురంలో తవ్వి వదిలేసిన రోడ్డు


శ్రమదానంతో గుంతలను మూసివేసిన స్థానికులు

తగిన చర్యలు తీసుకోవాలి..



రామంతాపూర్‌ పరిధిలోని బస్తీలు, కాలనీల్లో రోడ్లకు అధికారులు మరమ్మతులు చేయకుండా వదిలేస్తున్నారు. దీంతో స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లను తవ్వి వదిలేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలి. ప్రజాప్రతినిధులు, అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి వెంటనే మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకోవాలి.

– ఎర్రం శ్రీనివాస్‌, ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు

నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ శ్రీవాణి

రామంతాపూర్‌: డివిజన్‌ కార్పొరేటర్‌ బండారు శ్రీవాణి వెంకట్‌రావు బుధవారం రామ్‌శంకర్‌నగర్‌లో నిర్మాణమవుతున్న వరద నీటి కాలువకు సంబంధించిన పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలువ నిర్మాణాన్ని నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మించాలని, పనులు నిర్వహించేటప్పుడు స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్‌ అధికారులపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. జీహెచ్‌ఎంసీ ఏఈ శ్వేత, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ మహేందర్‌, కాలనీవాసులు అనిల్‌రాజ్‌, సుదర్శన్‌, పరశురాం, రఘునాథ్‌తో పాటు బీజేపీ నేతలు వెంకట్‌రావు, నారాయణదాసు, లింగం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మౌలాలి: వినాయక్‌నగర్‌ డివిజన్‌ పరిధిలో నవ భారత్‌ కాలనీలో వేస్తున్న నూతన సీసీరోడ్డు పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్‌ రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ సాగర్‌, కాలనీ అధ్యక్షుడు విజయ్‌, అండ్‌ టీమ్‌, బీజేపీ నేతలు ఓం ప్రకాష్‌, సాయి, సురేష్‌, శ్రీకాంత్‌, గోపాల్‌ పాల్గొన్నారు.


సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ రాజ్యలక్ష్మి

గుర్రపు డెక్క వ్యర్థాలను తొలగించాలి


చెరువు కట్ట వద్ద కార్పొరేటర్‌ శాంతిసాయిజెన్‌శేఖర్‌

మల్లాపూర్‌: నాచారం హెచ్‌ఎంటీనగర్‌ పెద్ద చెరువులో గత 20 రోజులుగా తొలగించిన గుర్రపు డెక్కను తక్షణమే తొలగించాలని నాచారం కార్పొరేటర్‌ శాంతి సాయిజెన్‌శేఖర్‌ ఎంటామాలజీ సిబ్బందికి సూచించారు. బుధవారం నాచారం హెచ్‌ఎంటీనగర్‌ పెద్ద చెరువును కార్పొరేటర్‌ సందర్శించారు. చెరువులో నుంచి తొలగించిన గుర్రపు డెక్క చెరువు కట్టపై వేయడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని, వెంటనే తొలగించాలన్నారు. ఎంటమాలజీ సూపర్‌వైజర్‌ నరసింహా, నేతలు మేకల ముత్యంరెడ్డి, విఠల్‌యాదవ్‌, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్‌ నేతలు

ఉప్పల్‌: ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తులపై ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం బీఆర్‌ఎస్‌ నేతలు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే గత శుక్రవారం ఉప్పల్‌ మహంకాళి ఆలయంలో జరిగిన సమావేశంలో చోటు చేసుకున్న వివాదంలో ఉప్పల్‌ ప్రాంతానికి చెందిన రామకృష్ణ ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు పలు రకాల ఆరోపణలు చేయడాన్ని వారు తప్పు పడుతూ సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొగిలిపాక రాంచందర్‌, ఎడ్ల పరమేష్‌, సుందర్‌, హనీఫ్‌బూ ఆశోక్‌చారి తదితరులు పాల్గొన్నారు.


కమ్యూనిటీహాల్‌ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మేయర్‌

కాలనీల అభివృద్ధికి కృషి

బోడుప్పల్‌: కాలనీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని బోడుప్పల్‌ మేయర్‌ తోటకూర అజయ్‌ యాదవ్‌ అన్నారు. బోడుప్పల్‌ 12, 24 డివిజన్లలో రూ. 20లక్షలతో ఇంద్ర యూత్‌ అసోసియేషన్‌ నూతన భవనాలకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశలవారీగా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ప్రారంభించిన పనులను వెంటనే పూర్తి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్‌, కార్పొరేటర్లు బొమ్మక్‌ కల్యాణ్‌కుమార్‌, గుర్రాల రమావెంకటేశ్‌యాదవ్‌, నాయకులు బద్దుల సత్యనారాయణ, జనిగె వెంకటేష్‌యాదవ్‌ పాల్గొన్నారు.



ఆకట్టుకుంటున్న చేనేత వస్త్రాలు



లాలాపేట: తార్నాకలోని ఐఐసీటీ సాఫ్‌ క్లబ్‌లో కళాసిల్క్‌ చేనేత హస్తకళా ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి చేనేత కళాకారులు తయారు చేసిన వస్త్రాలు, కళాఖండాలు వినియోగదారులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

ఈ సందర్భంగా నిర్వాహకులు వికాస్‌ జైన్‌ మాట్లాడుతూ.. ప్రతి రోజు ఉదయం10 గంటల నుంచి రాత్రి 9 వరకు ఈ ఎగ్జిబిషన్‌ ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. నగర ప్రజలకు అవసరమైన అన్ని రకాలైన పట్టు చీరలు, కాటన్‌ వస్త్రాలు, దుప్పట్లు, డ్రెస్‌ మెటీరియల్స్‌, రెడీమేడ్‌ వస్త్రాలు, కర్టెన్లు, హస్తకళాకారుల తయారు చేసిన కళాఖండాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ ఈనెల 17 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

రేషన్‌ బియ్యం పట్టివేత

మేడిపల్లి: మేడిపల్లి మండల కేంద్రంలో అక్రమంగా రేషన్‌ బియ్యాన్ని సరఫరా చేస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేశారు. మేడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రేషన్‌ బియ్యాన్ని సరఫరా చేస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పీర్జాదిగూడకు చెందిన దీరావత్‌ శ్రీను (42), బానోత్‌ మంజుల (31)బాలమ్మ (43)లను అదుపులోకి తీసుకున్న మేడిపల్లి పోలీసులు వారి నుంచి సుమారుగా 4.5క్వింటాళ్ల రేషన్‌బియ్యం, 2 ద్విచక్రవాహనాలను సీజ్‌ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

17న వన భోజనాలు

రామంతాపూర్‌: కార్తీకమాసం పురస్కరించుకుని కీసర మండలం దయారాలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఈనెల 17న వన భోజన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వన భోజనాల కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించి భగవంతుని అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

మల్కాజిగిరి: మల్కాజిగిరి ఎక్సైజ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న రెండు ద్విచక్ర వాహనాలు హోండా యాక్టివా) గురువారం ఉదయం 11 గంటలకు పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో వేలంపాట జరుగుతుందని సీఐ చంద్రశేఖర్‌ తెలిపారు. ఆసక్తి గల వారు ఏదైనా ఒరిజినల్‌ గుర్తింపుకార్డుతో రూ.2000 చెల్లించి నేరుగా పాల్గొనవచ్చని వివరించారు. వివరాలకు 8712658737.

స్థానిక సమస్యలు పరిష్కరించండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

మౌలాలి: వినాయక్‌నగర్‌ డివిజన్‌ పరిధి సాయినగర్‌ కాలనీవాసులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి స్థానిక సమస్యలపై చర్చించారు. త్రి ఫేస్‌ విద్యుత్‌ సరఫరా, స్తంభాల ఏర్పాటు, అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. త్వరలో సంబంధిత అధికారులతో కలిసి కాలనీలో పర్యటిస్తానని, సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నిరంతరం మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. చంద్రమౌళి, బుగ్గ ఉపేందర్‌, రమేష్‌, సుభాష్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

అల్వాల్‌: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌ నిబంధనలను పాటించి ప్రమాదాలు జరగకుండా చూడాలని మేడ్చల్‌ ట్రాఫిక్‌ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. అల్వాల్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం అల్వాల్‌లోని లయోలా అకాడమీలో ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. 18 ఏళ్లలోపు ఉన్న పిల్లలు వాహనాలు నడుపరాదన్నారు. అలా నడిపితే వారి తల్లిదండ్రులకు జరిమానాతో పాటు జైలుశిక్ష ఉంటుందని హెచ్చరించారు. సీట్‌ బెల్టు ధరించాలని, హెల్మెట్‌ లేకపోవడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. సెల్‌ఫోన్‌ డ్రైవింగ్‌ అత్యంత ప్రమాదకరమన్నారు. ట్రాఫిక్‌ పోలీసులు, లయోలా అకాడమీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి


జెడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్‌ బన్నాల గీతాప్రవీణ్‌

ఉప్పల్‌: ఉప్పల్‌ సర్కిల్‌ చిలుకానగర్‌ డివిజన్‌ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ చిలుకానగర్‌ కార్పొరేటర్‌ బన్నాల గీతాప్రవీణ్‌ ముదిరాజ్‌ బుధవారం ఎల్‌బీనగర్‌ జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ కేశవ్‌ పాటిల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. బీరప్పగడ్డ, న్యూరాంనగర్‌, కుమ్మరికుంట, బొడ్రాయి తదితర ప్రాంతాల్లో వరదనీటి కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయని, మరికొన్ని ప్రాంతాల్లో అవుట్‌ కలపకపోవడం వల్ల నిత్యం మురుగు సమస్య ఏర్పడుతుందని ఇలా పలు సమస్యలను జోనల్‌ కమిషనర్‌ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన జెడ్సీ త్వరలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు కార్పొరేటర్‌ తెలిపారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్‌: 33/11 కేవీ మల్లాపూర్‌ బెల్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని నోమా ఫీడర్‌ పరిధిలో విద్యుత్‌ మరమ్మత్తుల కారణంగా గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు చాణిక్యపురి కాలనీ, సూర్యనగర్‌, గోకుల్‌నగర్‌, మోడీ వెబర్స్‌, చండీయానగర్‌, బాబానగర్‌లో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఉంటుందని మల్లాపూర్‌ ఏఈ నాగరాజు తెలిపారు.

కాప్రా: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా సైనిక్‌పురి సబ్‌స్టేషన్‌ పరిధిలో గురువారం పలు కాలనీలకు విద్యుత్‌ సరఫరా నిలిచిపోతుందని ఏఈ సత్యనారాయణ తెలిపారు. డిఫెన్స్‌ కాలనీ, సైనిక్‌పురి ఫీడర్ల పరిధిలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు బాబాయ్‌ హోటల్‌, డిఫెన్స్‌ కాలనీ, డౌన్‌ ఏరియా, ఇందు ట్రావెల్‌, పంప్‌హౌస్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ నిలిచి పోనున్నట్లు పేర్కొన్నారు.

కుషాయిగూడ: చర్లపల్లి సబ్‌స్టేషన్‌, 11 కేవీ నాగారం ఫీడర్‌ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమత్తుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బాలరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్‌ పరిధిలోని రెడ్డికాలనీ, భగవాన్‌కాలనీ, కట్టింగ్‌ కాలనీ, హై టెన్షన్‌లేన్‌, మారుతీకాలనీ, మధురానగర్‌, ద్వారకాపురికాలనీ, చక్రిపురం కాలనీల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

ఉప్పల్‌: హబ్సిగూడ 11 కేవి ఐఎస్‌ఐ ఫీడర్‌ మరమ్మత్తుల కారణంగా గురువారం హబ్సిగూడలో పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈ గణేష్‌ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు జేఎస్‌ఎన్‌ కాలనీ, గాంధీ గిరిజన బస్తీ, వివేకానందనగర్‌, శోభానగర్‌, విజ్ఞానపురి తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

ఉప్పల్‌ భగాయత్‌లో..

ఉప్పల్‌ భగాయత్‌ 11 కేవీ భగాయత్‌ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు ఉప్పల్‌ భగాయత్‌, కాలభైరవ దేవాలయం, టీఎస్‌ఆర్‌లేన్‌, నారాయణస్కూల్‌ బూఏజీఆర్‌ ప్రాజెక్టు, హెచ్‌ఎండీఏ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. విద్యుత్‌ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బోర్‌వెల్‌ పనులు ప్రారంభం

అల్వాల్‌: మచ్చబొల్లారం డివిజన్‌ తుర్కపల్లి గ్రీన్‌ పార్క్‌ ఎవెన్యూలో పార్కు అభివృద్ధి కోసం బోర్‌వెల్‌ పనులను కార్పొరేటర్‌ రాజ్‌జితేంద్రనాథ్‌ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. పార్కులో పచ్చదనాన్ని ఇవ్వడానికి తమవంతు బాధ్యతగా స్థానికులు అందరూ పార్కులను సంరక్షించుకోవాలని సూచించారు. అగ్రికల్చర్‌ అధికారిని ప్రవీణ, నాగరాజు, వెంకటేష్‌గౌడ్‌, రమేష్‌, ఆనంద్‌, వెంకటేష్‌, దేవేందర్‌, కాలనీ అధ్యక్షులు రాజేశ్వర్‌, పరమేశ్వర్‌, నరేందర్‌కుమార్‌, రమేష్‌కుమార్‌, రాజేష్‌కుమార్‌, నాగేందర్‌కుమార్‌, మోహన్‌, విశ్వనాథ్‌, సీతంకుమారి, లలితారాణి, హారతిచౌదరి, గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ రాజ్‌జితేంద్రనాథ్‌

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



కాప్రా: ఏళ్ల తరబడి నెలకొన్న సమస్య కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలో పరిష్కారమైందని సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాప్రా డివిజన్‌ కాంగ్రెస్‌ నేతలు. శ్రీసాయి ఎన్‌క్లేవ్‌లో గత కొన్నేళ్లుగా నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం రూ. 30 లక్షల నిధులు మంజూరు చేసింది. ఉప్పల్‌ నియోజకవర్గం కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జ్‌ మందముల పరమేశ్వర్‌రెడ్డి సహకారంతో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రి శ్రీధర్‌బాబు నిధులు మంజూరు చేయడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్‌ నేత తోటకూర శ్రీకాంత్‌ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్థానిక కాంగ్రెస్‌ నేతలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

జేజీఆర్‌ స్కూల్‌లో ఆటల పోటీలు


ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బోడుప్పల్‌: బృందావన్‌ కాలనీలోని జేజీఆర్‌ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా ఆటలు పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్‌తో పాటు ఇతర పోటీలు నిర్వహించి గెలుపొందినవారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్‌ గంగరాజు మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థి దశ నుంచే అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. పాఠశాల ఇన్‌చార్జి విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభినందన


అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

ఉప్పల్‌: జాతీయస్థాయి చదరంగం పోటీల్లో ఆరోస్థానం సాధించి రూ. 25 వేల నగదు పురస్కారాన్ని అందుకున్న శరణ్యను ఉప్పల్‌ లిటిల్‌ ఫ్లవర్‌ పాఠశాల విద్యార్థినిని బుధవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది. తమిళనాడులో ఈనెల 3 నుంచి 11 వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి చదరంగం పోటీలో జూనియర్‌ బాలికల విభాగానికి చెందిన టోర్నమెంట్‌లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ప్రిన్సిపాల్‌ జోసఫ్‌ పసల అభినందించారు.

హరేకృష్ణ మహామంత్రం పఠనం

మల్లాపూర్‌: శ్రీకృష్ణుడిని ఆరాధిస్తే అన్ని శుభాలే కలుగుతాయని మల్లాపూర్‌ కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్‌ మున్సిపల్‌ గ్రౌండ్‌లో జగన్నాథ్‌ మహాప్రభు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 24 గంటల పాటు భరే రామ హరేకృష్ణ మహామంత్ర పఠనాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మల్లాపూర్‌ కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్‌ఎస్‌ నేతలు దయాకర్‌రెడ్డి, శ్రీశైలం, నిర్వాహకులు సత్యవరిక్‌, ప్రకాష్‌రావు, ఉపేందర్‌, మీనారావు, కళ్యాణ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


ధనుంజయ్‌ (ఫైల్‌)

కుషాయిగూడ: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్‌, నెహ్రూనగర్‌కు చెందిన గొడ్డెల ధనుంజయ్‌ (22) సివిల్‌ కాంట్రాక్టు పనులు చేసేవాడు. ఈ క్రమంలో ఆన్‌లైన్‌ బెట్టింగ్‌లకు అలవాటు పడి ఆర్థికంగా నష్టపోయాడు. దీంతో మనస్తాపం చెందిన అతడు సోమవారం రాత్రి తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం అతడి స్నేహితులు ఫోన్‌చేస్తే స్పందించకపోవడంతో అనుమానం వచ్చి తల్లి అనితకు సమాచారమిచ్చారు. దీంతో ఆందోళన చెందిన ఆమె స్థానికుల సహకారంతో గది తలుపు పగులగొట్టి చూడగా ఉరేసుకుని కనిపించాడు. కాగా ఆత్మహత్య చేసుకున్న విషయం తెలియకుండానే అంత్యక్రియలు పూర్తి చేయాలని కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారమివ్వకపోవడం గమనార్హం. ఈ క్రమంలో దగ్గరి బంధువులు రాకపోవడంతో అంత్యక్రియలు మంగళవారం జరగలేదు. పోలీసులకు విషయం తెలియడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్‌ ఇచ్చారు. బుధవారం మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సన్మానం


జలమండలి జీఎంను సన్మానిస్తున్న కార్పొరేటర్‌ రాజ్యలక్ష్మి

మౌలాలి: మల్కాజిగిరి సర్కిల్‌ హెచ్‌ఎండబ్ల్యూ, ఎస్‌ఎస్‌బీ జనరల్‌ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన సునీల్‌ను కార్పొరేటర్‌ రాజ్యలక్ష్మి సన్మానించారు. డివిజన్‌లో బోరుబావుల మరమ్మతులు, మురుగు నీటి కాల్వల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సమస్యలకు జీఎం సానుకూలంగా స్పందించారు. బీజేపీ డివిజన్‌ అధ్యక్షుడు ఓంప్రకాష్‌, ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌, సాయిసురేష్‌, కార్యదర్శి గోపాల్‌ పాల్గొన్నారు.

రేపు రాష్ట్ర కార్యవర్గం అత్యవసర భేటీ

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ (టీయూటీఎఫ్‌) రాష్ట్ర అత్యవసర కార్యవర్గ సమావేశం ఈ నెల 15న (శుక్రవారం) పీర్జాదిగూడ (ఉప్పల్‌ డిపో వెనుక)లో విజయ రత్న హైస్కూల్‌లో ఉదయం 11 గంటలకు జరగనున్నట్లు టీయూటీఎఫ్‌ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి జంకిటి కైలాసం ఒక ప్రకటనలో తెలిపారు.